సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.35 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీ కాయలు గరిష్టంగా రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు వచ్చిన సరుకును ఈ-నామ్ పద్ధతిలో వేలం వేశారు.



మహిళలకు ఆర్థిక దన్ను
తపాలా శాఖ 'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్' స్కీం ప్రవేశపెట్టింది. ఇందులో జమ చేసిన మొత్తానికి ఏడాదికి 7.5 శాతం వడ్డీ అందిస్తోంది. II లో

గరిష్టం/కనిష్టం
41.7°/22.4°
జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. ఎండ తీవ్రత బాగా తగ్గింది. సాయంత్రం అక్కడక్కడా చిరు జల్లులు కురిశాయి.

న్యూస్‌రీల్

నేడు ఈద్ ఉల్ ఫితర్
- రంజాన్ ప్రార్థనలకు సర్వం సిద్ధం



పుట్టపర్తి టౌన్: నెలవంక కనిపించడంతో ముస్లింలు నెల రోజుల కఠోర ఉప దీక్షలను విరమించారు. శనివారం రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఖురాన్ ఆవిర్భవించిన రంజాన్ మాసంలో ఆచరించిన నమాజులు, ఉపవాసాలు, చేసిన పుణ్య కార్యాలకు సంబంధించి అల్లాహ్ పండుగ రోజున ప్రత్యేకమైన బహుమానాన్ని అందిస్తారని ముస్లింల నమ్మకం. దీనికోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు మత పెద్దలు ఏర్పాట్లు చేశారు. మసీదు ప్రాంగణాల్లో వివిధ రకాలైన విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక ఆకర్షణగా వాటిని తీర్చిదిద్దారు.

8 రోజులే వేసవి సెలవులు
అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్‌కు వేసవి సెలవులు 8 రోజులు నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మే 13 నుంచి 21 వరకు మాత్రమే వేసవి సెలవులు ఉంటాయి. పీజీ రెండు, నాలుగో సెమిస్టర్ ఏప్రిల్ 24 నుంచి ప్రారంభం కానుంది. జూన్ 12 నుంచి 16 వరకు మిడ్-1 ఇంటర్నల్ పరీక్షలు జరుగుతాయి. జూలై 24 నుంచి 28 వరకు మిడ్ -2 ఇంటర్నల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఆగస్టు 16న పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు జరిగేలా షెడ్యూల్ ఖరారు చేశారు.

పోలీసుల్లో సమన్వయానికి 'కాఫీ విత్ మెన్'



అనంతపురం శ్రీకంఠం సర్కిల్: పోలీసు అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం కోసం అనంతపురం రేంజ్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో వారంలో ఒకరోజు 'కాఫీ విత్ మెన్' కార్యక్రమానికి డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డి శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పోలీస్ స్టేషన్ల సిబ్బంది - సచివాలయాల మహిళా పోలీసులను సమన్వయం చేసుకుని 'పోలీసింగ్'లో అభివృద్ధి సాధించడమే ఈ కార్యక్రమ ఉద్దేశం. శనివారం లేదా ఆదివారం ఆయా స్టేషన్ హౌస్ ఆఫీసర్లు 'కాఫీ విత్ మెన్' నిర్వహించాలని డీఐజీ సూచించారు. గడిచిన వారంలో అందించిన సేవలు.. తీసుకున్న చర్యలు.. రాబోయే వారంలో మెరుగ్గా తీసుకోవలసిన చర్యలపై చర్చించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం వల్ల సిబ్బంది మధ్య సమన్వయం పెరగడంతో పాటు హోదాలు మరచి అందరూ సమష్టిగా పనిచేసే అవకాశం కలుగుతుందని.. తద్వారా పోలీసులకు మెరుగైన సేవలందించవచ్చని తెలిపారు.

పరిశోధన.. వేదన



ఎస్కే యూనివర్సిటీ పాలక భవనం

- రీసెర్చ్ మార్గదర్శకాలకు ఎస్కేయూ తిలోదకాలు
- గైడ్‌లుగా రిటైర్డు ప్రొఫెసర్లు
- ఆ డాక్టరేట్లు చెల్లుబాటు కావంటూ విద్యార్థుల ఆందోళన



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పరిశోధన మార్గదర్శకాలకు తిలోదకాలు ఇచ్చారు. పీహెచ్‌డీ కోర్సు విధివిధానాలు, మార్గదర్శకాలు 2019లో రూపకల్పన చేశారు. అప్పటి నుంచి ఇవే విధానాలు అమలవుతున్నాయి. అనంతపురం జేఎన్‌టీయూతో పోల్చితే శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సైన్స్ విభాగాల్లో మంజూరు చేసే డాక్టరేట్లకు విశ్వసనీయత అధికంగా ఉంటుందని పరిశోధన విద్యార్థుల భావన. అయితే తాజాగా నిబంధనలు విస్మరిస్తూ ఇష్టానుసారంగా నిర్ణయాలు అమలు చేస్తున్నారు. అర్హత లేని వారిని పరిశోధన గైడ్‌లుగా నియమిస్తున్నారు. ఇలాంటి వారు జారీ చేసే పీహెచ్‌డీ అవార్డులు చెల్లుబాటు కావనే అంశం పరిశోధన విద్యార్థుల్లో ఆందోళనకు కారణమైంది.

నిబంధనలకు విరుద్ధంగా రీసెర్చ్ గైడ్‌ల నియామకం

ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగ విరమణ చేయడానికి రెండేళ్ల ముందు నుంచి పీహెచ్‌డీ అడ్మిషన్లు వీరి కింద చేయడానికి వీల్లేదు. తాజాగా ఈ నిబంధనను మూడు సంవత్సరాలకు పెంచారు. అయినప్పటికీ ఉద్యోగ విరమణ చేసిన ప్రొఫెసర్లే రీసెర్చ్ గైడ్‌గా వ్యవహరిస్తున్నారు. మార్గదర్శకాల ప్రకారం రిటైర్డు ప్రొఫెసర్ల కింద పరిశోధన చేస్తున్న విద్యార్థులను తక్షణమే ఇతర ప్రొఫెసర్ల కిందకు మార్పు చేయాలి. కానీ ఇక్కడ భిన్నంగా వ్యవహరిస్తున్నారు. రిటైర్డు అయిన వారి కిందే పీహెచ్‌డీ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. సింహభాగం సైన్స్ విభాగాల్లో, ఆర్ట్స్ విభాగాల్లోనూ ఈ విధంగా వ్యవహరిస్తున్నారు. వీరి నేతృత్వంలో పరిశోధన చేసి పీహెచ్‌డీ అవార్డు అయితే చెల్లుబాటు కాదని 2019 పరిశోధన మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి.

బదలాయింపులో జాప్యమేల?

విశ్రాంత ప్రొఫెసర్ల నేతృత్వంలో పరిశోధన చేస్తున్న విద్యార్థులను అదే విభాగంలోని మరో ప్రొఫెసర్‌కు బదలాయింపు చేయాల్సి ఉంటుంది. ఒక వేళ అదే విభాగంలో ఫ్యాకల్టీ లేకపోతే అర్హులైన డిగ్రీ కళాశాల లెక్చరర్లకు కో గైడ్‌గా అవకాశం కల్పించాలి. ఇవన్నీ పట్టించుకోకుండా విద్యార్థుల భవితకు విఘాతం కలిగేలా యూనివర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

పరిశీలిస్తున్నాం



విశ్రాంత ప్రొఫెసర్ల నేతృత్వంలో ఎంత మంది విద్యార్థులు పరిశోధన చేస్తున్నారనే వివరాలు పరిశీలిస్తున్నాం. ఇది వరకే వీసీ దృష్టికి తీసుకెళ్లాం. నిబంధనలు విస్మరించకుండా పరిశోధన విద్యార్థుల బదలాయింపు జరిగేలా చర్యలు తీసుకుంటాం.
– ప్రొఫెసర్ కృష్ణకుమారి, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్, ఎస్కేయూ

అధికారుల వైఖరి సరికాదు



పరిశోధన మార్గదర్శకాలు-2019ను పాటించడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఒక పరిశోధన విద్యార్థి నష్టపోయినా అందుకు యూనివర్సిటీ అధికారులంతా బాధ్యత వహించాల్సి ఉంటుంది. అనర్హులను గైడ్‌గా నియమించి విద్యార్థులను ఇబ్బందిపెడుతున్న వర్సిటీ అధికారుల వైఖరి సరికాదు.
– హేమంత్ కుమార్, మైక్రోబయాలజీ విద్యార్థి విభాగం, ఎస్కేయూ

బడుగు వికాసానికి దరఖాస్తుల ఆహ్వానం
అనంతపురం టౌన్: ఎస్సీ, ఎస్టీ యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీలతో 'జగనన్న బడుగు వికాసం' పథకాన్ని ప్రవేశపెట్టినట్లు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు తెలిపారు. ఈ పథకానికి అర్హులైన ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 2023-24ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యూనిట్లు స్థాపించే పారిశ్రామికవేత్తలు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా ఈ ఏడాది 45 శాతానికి పైగా ప్రత్యేక రాయితీలను ప్రభుత్వం అందిస్తున్నట్లు వెల్లడించారు. సేవా రంగంతోపాటు పారిశ్రామిక రంగాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చుచని తెలిపారు. మరిన్ని వివరాలకు పరిశ్రమల శాఖ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.

మహిళా సంఘాలకు శఠగోపం!
- వైకేపీ సీసీ ప్రసాద్, స్త్రీ నిధి మేనేజర్ అనిల్ చేతివాటం
- రూ.50 లక్షల దుర్వినియోగం
- మహిళా సంఘాల ఫిర్యాదుతో కేసు నమోదు

పుట్టపర్తి: మహిళా సంఘాల్లోని సభ్యుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వైకేపీ సీసీ, స్త్రీ నిధి మేనేజర్ చేతివాటం చూపారు. ఏకంగా రూ.50 లక్షలు దుర్వినియోగం చేశారు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న మహిళా సంఘాల సభ్యులు బుక్కపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. ఎస్ఐ నరసింహుడు తెలిపిన వివరాల మేరకు... బుక్కపట్నం మండలం మారాల క్లస్టర్ సీసీగా ప్రసాద్ 2017 నుంచి 2022 జూన్ వరకు పని చేశారు. క్లస్టర్ పరిధిలోని మారాల, కృష్ణాపురం, యాదాలంకపల్లి, రామసాగరం, గూనిపల్లి, సీసీ తండా పరిధిలోని సంఘాల్లోని సభ్యులు ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం రుణాలు మంజూరు చేయగా, వాటి రికవరీలో ప్రసాద్ చేతివాటం చూపారు. మహిళా సంఘాల నుంచి చెక్కులను తీసుకుని వాటిని రుణం కింద జమ చేయకుండా దారి మళ్లించాడు. ఇలా తన స్నేహితుల బ్యాంక్ ఖాతాలకు రూ.39,57,370 మళ్లించాడు. అలాగే తన వ్యక్తి గత ఖాతాకు మరో రూ.రెండు లక్షలు జమ చేసుకున్నాడు. మొత్తంగా రూ.41,51, 370 దుర్వినియోగం చేశాడు. అనంతరం సీసీ ప్రసాద్ స్త్రీనిధి మేనేజర్ అనిల్‌ను మచ్చిక చేసుకుని అతనికీ వాటా ఇచ్చాడు. దీంతో స్త్రీనిధి మేనేజర్ అనిల్ ఆడిటింగ్ సమయంలో ఈ నిధులు జమ అయినట్లు ఆన్‌లైన్‌లో చూపాడు. రూ.41 లక్షలతో పాటు ఖర్చుల కింద రూ.10 లక్షలు చూపి మొత్తంగా రూ. 50,17,315 సొమ్ములు పక్కదారి పట్టించాడు. ఈ తతంగమంతా 2017 -18 మధ్యకాలంలో జరిగింది. ప్రసాద్ గత ఏడాది కొత్త చెరువు మండలం లోచర్లకు బదిలీ కాగా, అక్కడా అవినీతికి పాల్పడి సస్పెండ్ అయ్యాడు. దీంతో అధికారులు ప్రసాద్ గతంలో పనిచేసిన మారాల క్లస్టర్‌లోనూ విచారణ చేయగా, వీరి బాగోతం బట్టబయలైంది. దీంతో మహిళా సంఘాల సభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ధర్మవరాన్ని హాకీ హబ్‌గా మారుస్తాం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: హాకీ హబ్‌గా ధర్మవరాన్ని తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఎస్ రాయుడు మెమోరియల్ 13వ రాష్ట్రస్థాయి సీనియర్ మెన్ హాకీ టోర్నీని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణుక్యరాజు ప్రారంభించారు. తొలుత దివంగత సీనియర్ హాకీ క్రీడాకారుడు బీఎస్ రాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. శాప్ సహకారంతో నియోజకవర్గంలో రూ.1.50 కోట్ల వ్యయంతో ఇండోర్ స్టేడియం నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అంతేకాక హాకీ ప్రాక్టీస్ కోసం ఆర్డీటీకి 5 ఎకరాల స్థలం కేటాయించినట్లు తెలిపారు.

ప్రైజ్‌మనీ ప్రకటించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి..

హాకీ టోర్నీలో విజేతలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి రూ.85 వేల ప్రైజ్ మనీ ప్రకటించారు. టోర్నీ విన్నర్స్ జట్టుకు రూ.50 వేలు, రన్నర్స్ జట్టుకు రూ.25 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతి అందిస్తామన్నారు.

శ్రీసత్యసాయి సప్తపది

జిల్లా హాకీ క్రీడాకారులు సత్తా చాటారు. బీఎస్ రాయుడు మెమోరియల్ 13వ రాష్ట్రస్థాయి సీనియర్ మెన్ హాకీ టోర్నీలో తొలిరోజు ఘన విజయం సాధించారు. కర్నూలు జిల్లాతో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 7-0 గోల్స్‌తో జయకేతనం ఎగురవేశారు. అంతకుముందు జరిగిన మ్యాచ్‌లలో అనంతపురం, ప్రకాశం జిల్లా జట్లు తలపడగా, 5-2 గోల్స్ తేడాతో అనంతపురం, శ్రీకాకుళం, నెల్లూరు మధ్య జరిగిన మ్యాచ్‌లో 3-1 తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది. వైఎస్సార్, ఎన్టీఆర్ జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఇక తిరుపతితో జరిగిన మ్యాచ్‌లో 10-4 గోల్స్ తేడాతో విజయనగరం జట్టు జయకేతనం ఎగురవేసింది.

సాగులో రైతుకు సాయంగా నిలుద్దాం

- ఆర్బీకేల ద్వారా నాణ్యమైన సేవలు అందించాలి
- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో అవుటాల రమణారెడ్డి, బోయ గిరిజమ్మ

పుట్టపర్తి అర్బన్: విత్తనాలు, ఎరువులు మొదలు రైతులకు కావాల్సినవన్నీ అందుబాటులో ఉంచి సాగులో సాయంగా నిలుద్దామని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి అధ్యక్షతన జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రైతు భరోసా కేంద్రాలు, మండల, జిల్లా స్థాయిలో ప్రతి నెలా వ్యవసాయ సలహా మండలి సమావేశాలు తప్పని సరిగా నిర్వహించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు మేలు చేసే విధంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. వ్యవసాయంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్బీకేల్లో వ్యవసాయ, ఉద్యాన, ఇతర అసిస్టెంట్లు అందుబాటులో ఉండాలన్నారు. ఉదయం క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినా మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ అందుబాటులో ఉండాలన్నారు. రైతులకు అవసరమైన మామిడి, చీనీ, సపోటా మొక్కలు అందించాలన్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి..

జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ రైతులకు మేలు జరిగేలా పనిచేయాలన్నారు. కొన్ని ఆర్బీకేలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, శాశ్వత భవన నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలన్నారు. ఆయా పంటలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

మట్టి పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించాలి..

జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ రైతు పక్షపాతిగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా రైతుకు అండగా నిలుస్తున్నారన్నారు. వేసవి ముగిసేలోపు రైతులు స్వచ్ఛందంగా వచ్చి మట్టి నమూనాలు తీసి సాయిల్ టెస్టింగ్ చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సచివాలయాలు, ఆర్బీకేల్లో సిబ్బంది అందుబాటులో లేరన్న ఫిర్యాదులు వస్తున్నాయని, పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సారి ఖరీఫ్‌లో నాణ్యమైన విత్తనాలు సరఫరా చేసి రైతులకు సకాలంలో అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, సెరికల్చర్ జేడీ పద్మమ్మ, మార్కెటింగ్ శాఖ అధికారి నరసింహమూర్తి, ఏపీ న్యాచురల్ ఫార్మింగ్ అధికారి లక్ష్మానాయక్, పలువురు శాస్త్రవేత్తలు, అడ్వయిజరీ బోర్డు సభ్యులు బసిరెడ్డి, హనుమంతరెడ్డి, సుధీర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కేశవరెడ్డి, పి.కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' అర్జీల పరిష్కారంపై ఆడిటింగ్

- గడువులోపు సమస్య పరిష్కరించని అధికారికి మెమో
- టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు



లేపాక్షి ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న కలెక్టర్ అరుణ్‌బాబు, సబ్ కలెక్టర్ కార్తీక్

పుట్టపర్తి అర్బన్: "ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న 'స్పందన' కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలిస్తున్నారు. వాటిని పరిష్కరించినట్లు అధికారులూ నివేదికలిస్తున్నారు. అయితే కొన్ని అర్జీలు మళ్లీ వస్తున్నాయి. ఇక నుంచి అలా జరగడానికి వీల్లేదు. 'స్పందన' అర్జీలు నాణ్యంగా పరిష్కరించారా... లేదా... అని జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ఆడిట్ బృందాలతో పరిశీలన చేయిస్తాం. నిర్దేశిత గడువులోపు సమస్య పరిష్కరించని అధికారికి మెమో ఇస్తాం" అని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన స్పందన, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెన్ గ్రీవెన్స్‌లు, అధికారుల క్షేత్రస్థాయి పర్యటనలు తదితర వాటిపై జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, తిప్పేనాయక్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఒక్క అర్జీ బియాండ్ ఎస్ఎల్ఏలోకి రాకూడదన్నారు. ఏదైనా అర్జీ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వస్తే సంబంధిత అధికారికి మెమో ఇవ్వాలని డీఆర్వో కొండయ్యను ఆదేశించారు. అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపారా, లేదా అని ఆడిట్ బృందాలు పరిశీలిస్తాయన్నారు. గ్రీవెన్స్ నాణ్యతగా పరిష్కరించడం, అర్జీదారుడు సంతృప్తి చెందడం రెండూ ముఖ్యమేనన్నారు. ప్రస్తుతం రీఓపెన్ కేసులు 31 ఉన్నాయని, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

సమస్యలపై నివేదిక ఇవ్వాలి..

ప్రతి శుక్రవారం అధికారులకు కేటాయించిన పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తప్పక సందర్శించడంతో పాటు ఆయా శాఖల పరిధిలోని పనులను పరిశీలించాలన్నారు. అక్కడ నెలకొన్న సమస్యలపై నివేదిక అందించాలన్నారు. వాట్సాప్ గ్రూపులో పంపిన మెసేజ్‌లకు అందరూ స్పందించాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి పెండింగ్ లేకుండా సకాలంలో అందజేయాలన్నారు. పాఠశాలల తనిఖీ, 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో మంజూరైన పనులను పూర్తి చేయించాలన్నారు.

అంకితభావంతో సేవలందించాలి..

ప్రభుత్వ ఉద్యోగులంతా అంకిత భావంతో ప్రజలకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో 16వ నేషనల్ సివిల్ సర్వీసెస్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశంలోని వివిధ పబ్లిక్ సర్వీసెస్ విభాగాల్లో నిమగ్నమైన అధికారుల సేవలను గుర్తించి సత్కరించేందుకు ఏటా ఏప్రిల్ 21 సివిల్ సర్వీసెస్ డేగా జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, ఆర్డీఓ భాగ్యరేఖలు మాట్లాడారు. మెరుగైన సేవలతోనే ప్రజాభిమానం సాధ్యమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డ్వామా పీడీ రామాంజనేయులు, డీహెచ్ఓ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి ఆలయం అద్భుతం
లేపాక్షి: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి వీరభద్ర స్వామి దేవాలయం చాలా అద్భుతంగా ఉందని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్‌తో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలకగా, గైడ్ ఆలయ ప్రాశస్త్యం, దేవాలయ నిర్మాణం, కట్టడాలు, సభా మండపం, విజయనగర సామ్రాజ్యంలో ఆలయానికి ఉన్న ప్రాధాన్యత గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మండపం, లతా మండపం, కుడ్యవర్ణ చిత్రాలు, ఏకశిలా వినాయకుడు, నాగలింగం, వేలాడే స్తంభాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. శిల్పకళా నైపుణ్యం, వాస్తు నిర్మాణ శైలిని చూస్తూ ఉండిపోయారు. అనంతరం నంది విగ్రహం, జటాయువు పక్షి, థీంపార్కును సందర్శించారు. కలెక్టర్ వెంట జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, పర్యాటక శాఖ మేనేజర్‌లు శరత్, లక్ష్మణ్‌రావు, ఆలయ ఈఓ నరసింహమూర్తి, తహసీల్దార్ బాబు, వీఆర్‌ఓ రమేష్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను సన్మానించిన జెడ్పీ చైర్‌పర్సన్



కలెక్టర్‌ను సన్మానించిన జెడ్పీ చైర్‌పర్సన్, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు సభ్యులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా స్థాయి అగ్రి అడ్వయిజరీ బోర్డు సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ నూతన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును ఘనంగా సన్మానించారు. కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం ఉదయం జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, బోర్డు సభ్యులు హిందూపురం బసిరెడ్డి, మడకశిర హనుమంతరెడ్డి, కదిరి సుధీర్‌రెడ్డి, పెనుకొండ సుబ్బారెడ్డి, ధర్మవరం కేశవరెడ్డి, పుట్టపర్తి కేశవరెడ్డిలతో కలిసి వెళ్లి దుశ్శాలువ కప్పి బొకేలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు విషయాలపై చర్చించినట్లు పేర్కొన్నారు.

ఇద్దరు బాలికల అదృశ్యం

మడకశిర: మండలంలో ఇద్దరు మైనర్ బాలికలు అదృశ్యమయ్యారు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని యూ రంగాపురంకు చెందిన తసీనా (16) అనే మైనర్ బాలిక గురువారం ఉదయం 11.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. అదే విధంగా ఇదే మండలంలోని దాసప్ప పాళ్యం గ్రామానికి చెందిన ఝాన్సీ (16) అనే బాలిక కూడా బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని చెప్పారు. కేసు నమోదు చేసుకొని అదృశ్యమైన బాలికల కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళలకు ఆర్థిక దన్ను

మారిన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా తపాలాశాఖ ఉనికి చాటుకునేందుకు ప్రయత్నిస్తోంది. వివిధ వర్గాల వారిని ఆకట్టుకునేలా రకరకాల పథకాలను ప్రవేశపెడుతోంది. ఇందులో భాగంగా అమ్మాయిలు, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్' అనే సరికొత్త స్కీం అమలుకు శ్రీకారం చుట్టింది. అయితే ప్రచారంలో తపాలాశాఖ అధికారులు వెనకబడ్డారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- మగువల మనసు దోచేలా తపాలాశాఖ సరికొత్త పథకం
- 'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్'తో అన్ని విధాలా అండ
- రూ.1000 నుంచి రూ.2 లక్షల దాకా డిపాజిట్‌కు అవకాశం





అనంతపురం సిటీ: తపాలాశాఖ 'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్' అనే కొత్త స్కీం అమల్లోకి తెచ్చింది. అప్పుడే పుట్టిన వారు మొదలు మహిళలందరూ ఈ పథకంలో చేరేందుకు అవకాశం కల్పించింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రత్యేకంగా చేర్చారు.

వన్‌టైం సేవింగ్స్ స్కీం..

మహిళా సమ్మాన్ సేవింగ్స్ స్కీం.. వన్ టైం సేవింగ్స్ స్కీం. ఇది 2025 మార్చి 31 వరకు మాత్రమే అమలులో ఉంటుందని తపాలాశాఖ ప్రకటించింది. ఈ స్కీంలో చేరే అమ్మాయిలు, మహిళలు కనిష్ఠ పెట్టుబడి రూ.1000 మొదలుకొని రూ.2 లక్షల వరకు డిపాజిట్ చెయ్యొచ్చు. గరిష్ఠ మొత్తానికి (రూ.2 లక్షలు) లోబడి ఎన్ని ఖాతాలైనా తెరిచే అవకాశాన్ని కూడా కల్పించింది. ఇప్పటికే ఖాతా ఉన్నట్లయితే కనీసం మూడు నెలల టైం గ్యాప్‌తో మళ్లీ ఖాతా తెరచుకోవచ్చు. ప్రారంభించిన తేదీ నుంచి రెండేళ్లు పూర్తయిన తరువాత మెచ్యూరిటీ కింద డబ్బు డ్రా చేసుకోవచ్చు. అయితే వడ్డీ రేటు మాత్రం ఏడాదికి 7.5 శాతం ఉంటుంది. అయితే ఒకరి పేరుతోనే ఖాతా తెరవాలి. జాయింట్ అకౌంట్ సౌకర్యం లేదు.

ఏడాది తరువాత ఏం చెయ్యొచ్చంటే..

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ కింద డిపాజిట్ చేసిన వారు ఏడాది తరువాత 40 శాతం డబ్బు ఉపసంహరించుకునే వీలు కూడా ఉంది. ఏ కారణాలతో అయినా డిపాజిటర్ మరణించినా లేదా కారుణ్యం కింద ఖాతా మూసివేసుకోవచ్చు. 2 శాతం తగ్గిన వడ్డీతో ఆరు నెలల తరువాత ఎప్పుడైనా ఖాతాను మూసివేయవచ్చు.

కట్టిన మొత్తానికి రెండేళ్ల తర్వాత వచ్చేదిలా..	
కట్టిన మొత్తం	చేతికందే మొత్తం
రూ.1,000	రూ.1154
రూ.10,000	రూ.11,542
రూ.50,000	రూ.57,714
రూ.1,00000	రూ.1,15,428
రూ.2,00000	రూ.2,30,854

కావాల్సిన పత్రాలు..

మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ స్కీంలో చేరాలంటే ఆధార్ కార్డు, పాన్‌కార్డు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు. వీటిని తీసుకొని సమీపంలోని సబ్ పోస్టాఫీస్ లేదా బ్రాంచ్ పోస్టాఫీస్‌కు వెళ్లి ఖాతా తెరవవచ్చు.

ప్రచారం లేక.. స్పందన రాక..

కొత్తగా ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ స్కీంకు సంబంధించి పట్టణ ప్రాంతాల నుంచి కొంత వరకు స్పందన వస్తోందని తపాలాశాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల నుంచి ఎవరూ ముందుకు రావడం లేదని వారే అంగీకరిస్తున్నారు. దీతో విస్తృత ప్రచారం కల్పించడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

అవగాహన కల్పించేలా ఆదేశాలు



మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ గురించి ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు అన్ని శాఖల అధికారుల సహకారం తీసుకుంటున్నాం. దీనికి తోడు కరపత్రాలు, గోడ పత్రికలను సైతం గ్రామీణ ప్రాంతాల్లోని మా సిబ్బందికి అందజేశాం. స్కీం ప్రయోజనాలు వివరించి, ప్రజల్లో అవగాహన పెంపొందించి వారితో ఖాతాలు తెరిపించాలని ఆదేశించాం.

– బాలసత్యనారాయణ, తపాలాశాఖ సూపరింటెండెంట్, అనంతపురం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మడకశిరలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఎస్వీ కృష్ణారెడ్డి

మడకశిర: సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలో డ్రైడే నిర్వహించారు. వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫీవర్, లార్వా సర్వే నిర్వహించారు. అనంతరం మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధుల గురించి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 25న ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన ర్యాలీలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి మలేరియా నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తామన్నారు. అనంతరం కొత్త ఎస్సీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ..

మడకశిర అర్బన్ హెల్త్ సెంటర్‌ను జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జ్వరపీడితుల వివరాలను తెలుసుకున్నారు. రక్త నమూనాలపై ఆరా తీశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, డాక్టర్ మంజుల, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మీనాయక్, సిబ్బంది ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

- తల్లిదండ్రులు మందలించడమే కారణం



జయకృష్ణ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: తల్లిదండ్రులు మందలించారన్న నెపంతో మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెంకటంపల్లిలో చోటు చేసుకుంది. తల్లిదండ్రులు, పోలీసుల వివరాల మేరకు... మండలంలోని వెంకటంపల్లికి చెందిన కంసలి సుబ్రమణ్యం, సుధా దంపతుల కుమారుడు జయకృష్ణ (23) గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. జయకృష్ణ ఇంటర్ పూర్తి చేసుకున్న తర్వాత చదువు మానేశాడు. తల్లిదండ్రులు అప్పు చేసి ఆటో కొనిచ్చారు. ఆటో తోలుకుంటూ బతుకుతున్న జయకృష్ణ కొన్ని రోజులుగా ఆటో సక్రమంగా తోలకుండా ఆటోఫైనాన్స్ కంతులు చెల్లించలేదు. దీంతో కుమారుడిని గురువారం రాత్రి తల్లిదండ్రులు మందలించారు. తల్లిదండ్రులు రాత్రి భోజనం చేసిన తర్వాత ఇంటి బయట పడుకున్నాడు. ఇంటిలో నిద్రించిన జయకృష్ణ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం తెల్లవారిన తర్వాత గుర్తించిన తల్లిదండ్రులు ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతున్న కుమారున్ని కిందకు దింపగా అప్పటికే చనిపోయాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

'గురుకులం'లో ప్రవేశాలకు రేపు ప్రవేశ పరీక్ష

- 5వ తరగతిలో ఒక్కో సీటుకు 8 మంది పోటీ
- ఇంటర్‌లో రెండు సీట్లకు ఏడుగురు విద్యార్థుల పోటీ

రాప్తాడురూరల్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు) 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 23న రాత పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 5వ తరగతిలో ఒక్కో సీటు కోసం 8 మంది, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రెండు సీట్లకు ఏడుగురు విద్యార్థులు పోటీ పడుతున్నారు. వివరాలను గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ ఎస్.బాలాజీనాయక్ శుక్రవారం వెల్లడించారు. 5వ తరగతిలో 1,200 సీట్లకు 10,033 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇంటర్‌లో 1,120 సీట్లకు గాను 4,228 దరఖాస్తులు వచ్చాయన్నారు. పరీక్ష నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశామన్నారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ జిరాక్స్, బ్లూ/బ్లాక్ బాల్‌పెన్ తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 91604 12551, 98856 50052, 99595 59400 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుడిబండ: స్థానిక బీసీ బాలికల గురుకుల కళాశాలలో 2023–24 సంవత్సరంలో ఇంటర్ ప్రవేశాలకు 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఎంపీసీ 60, బైపీసీ 40, సీఈసీ 40 సీట్లు ఉన్నాయన్నారు. ఈ కోర్సుల్లో ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు మే 18లోపు దరఖాస్తు రుసుం రూ.250 ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థిని వయస్సు 17 సంవత్సరాలు మించరాదని తెలిపారు. ప్రవేశ పరీక్ష మే 28న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 8978578111, 9989565658 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

అక్రిడిటేషన్ కమిటీ అస్తవ్యస్తం

- అధిక సర్క్యులేషన్ ఉన్న తెలుగు దినపత్రికల ప్రతినిధులకు దక్కనిచోటు
- వివాదాస్పదంగా డీపీఆర్‌ఓ వ్యవహారం

సాక్షిప్రతినిధి, అనంతపురం: జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేసే కమిటీ అస్తవ్యస్తంగా మారింది. జిల్లా పౌర సంబంధాల అధికారి కనీస అవగాహన లేకుండా ఇష్టారాజ్యంగా జాబితాను రూపొందించి కలెక్టర్‌కు పంపించారు. దీంతో అనర్హులకు కమిటీలో చోటు కల్పించినట్టైంది. వాస్తవానికి అత్యధిక సర్క్యులేషన్ కలిగిన తెలుగు, ఇంగ్లిష్ పత్రికల నుంచి ఒక్కొక్కరికి ప్రతినిధి కమిటీలో చోటు కల్పించాలి. కానీ జిల్లాలో అత్యధిక సర్క్యులేషన్ ఉన్న ఏ పత్రిక నుంచి కూడా ఒక్క ప్రతినిధికీ చోటు కల్పించలేదు. ఒక ఇంగ్లిష్ దినపత్రిక నుంచి ఒకరిని, నామమాత్రం సర్క్యులేషన్ కూడా లేని తెలుగు దినపత్రిక నుంచి ఒకరికి చోటు కల్పించారు. నిబంధనలు కాదని తనకు నచ్చిన కొంతమంది పేర్లతో జాబితాను కలెక్టర్ అనుమతికి పంపించారు. చాలా రోజుల తర్వాత వేస్తున్న ఈ కమిటీని పకడ్బందీగా, నిబంధనల మేరకు వేయాల్సి ఉండగా ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై డీపీఆర్‌ఓ రమేష్‌ను 'సాక్షి' వివరణ కోరగా... 'నాకు తెలీదు.. మీరు కావాలంటే కమిషనర్‌నుగానీ, కలెక్టర్‌గానీ సంప్రదించండి.. అవన్నీ నన్ను అడిగితే నేను చెప్పలేను.. మీరేదైనా ఉంటే అక్కడ చూసుకోండి' అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దీనిపై రాష్ట్ర ప్రజాసంబంధాల విభాగం కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డిని సంప్రదించగా.. అత్యధిక సర్క్యులేషన్ ఉన్న తెలుగు దినపత్రిక నుంచి ఒకరు, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి విధిగా ఒకరికి చోటు కల్పించాలని, దీనిపై కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు.

పారదర్శకత కోసమే 'లోకోస్'యాప్

గాండ్లపెంట: స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలన్నీ పారదర్శకంగా నిర్వహించడమే 'లోకోస్'యాప్ ముఖ్య ఉద్దేశమని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహిస్తున్న లోకోస్ శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశానికి పీడీ హాజరై మాట్లాడారు. గతంలో సంఘాల ఆర్థిక లావాదేవీలన్నీ మొబైల్‌యాప్ ద్వారా నమోదు చేసేవారన్నారు. అయితే దేశ వ్యాప్తంగా (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్ ద్వారా 'లోకోస్' యాప్ వినియోగించి స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలన్నీ యాప్ ద్వారా సంఘ సభ్యురాలికి సమాచారం అందించే వీలుందన్నారు. అలాగే సంఘ సభ్యురాళ్లు తీసుకున్న రుణాలు, పొదుపు ఇతరత్రా సంఘాలకు సంబంధించిన అన్ని అంశాలు లోకోస్ ద్వారా సభ్యులకు సమాచారం అందుతుందన్నారు. తద్వారా సంఘ ఆర్థిక లావాదేవీలన్నీ పారదర్శకంగా నిర్వహించే వీలుందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీతో పాటు డీపీఎం ఐబీ నాగరాజు, గాండ్లపెంట ఏపీఎం సూర్యనారాయణ, కదిరి, ఓడీసీ మండలాల ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

స్కూల్ బస్సుకింద పడి బాలుడి మృతి

- చాపిరి గ్రామంలో విషాదం



విహాన్ మృతదేహం వద్ద కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

కళ్యాణదుర్గం: స్కూల్ బస్సు దూసుకెళ్లడతో ఓ బాలుడు మృతి చెందాడు. స్థానికుల వివరాలమేరకు.. మండలంలోని చాపిరి గ్రామానికి చెందిన మధు, వాణీ దంపతులకు ఒక్కగానొక్క సంతానం అయిన విహాన్ (5) కళ్యాణదుర్గం జ్ఞానభారతి పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం విహాన్ పాఠశాల నుంచి బస్సులో చాపిరి గ్రామానికి వచ్చాడు. బస్సుదిగి ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తూ బస్సు వెనుక చక్రాల కింద పడ్డాడు. స్కూల్ బస్సు డ్రైవర్ గమనించకుండా ముందుకు వెళ్లడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో విహాన్ బస్సు టైరు కింద పడి మృతి చెందాడు. గమనించిన గ్రామస్తులు స్కూల్ బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులకు సమాచారం అందించారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కొడుకు మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లితండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. చిన్నారి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

రోకలితో భార్యను కడతేర్చిన భర్త



భార్యను హత్యచేసి మృతదేహం పక్కనే కూర్చొని ఉన్న భర్త ఓబుల్‌రెడ్డి

తాడిపత్రి: రోకలితో కొట్టి కట్టుకున్న భార్యనే కడతేర్చాడో భర్త. మండలంలోని వెలంకూరులో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ వివరాల మేరకు... వెలంకూరుకు చెందిన ఓబుల్‌రెడ్డి, నారాయణమ్మ (75) దంపతులకు ఇరువురు కుమార్తెలు. వారికి వివాహమై ఒకరు తాడిపత్రి పట్టణంలో, మరొకరు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో నివాసం ఉంటున్నారు. వృద్ధదంపతులైన వీరు వారి కుమార్తెల వద్ద చెరొకరు ఉంటున్నారు. శుక్రవారం ఉదయం వారి కుమార్తెల వద్ద నుంచి ఇరువురు స్వగ్రామానికి చేరుకున్నారు. ఎన్నాళ్లు మనం ఇలా కుమార్తెల ఇండ్ల వద్ద ఉంటాం అన్న చర్చ వారిద్దరి మధ్య జరిగింది. మాటా మాటా పెరగడంతో క్షణికావేశంలో ఓబుల్‌రెడ్డి రోకలితో భార్య నారాయణమ్మ తలపై మోదడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నారాయణమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బ్యాటరీల దొంగల ముఠా అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్‌లో ఎయిర్‌టెల్ సెల్‌టవర్‌కు సంబంధించిన బ్యాటరీలు ఈనెల 17న చోరీకి గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం బ్యాటరీ ముఠాను అరెస్టు చేసినట్లు రాయదుర్గం రూరల్ సీఐ యుగేంధర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉరవకొండకు చెందిన కిరణ్‌బాబు, చందా హరీష్, ఆంజినేయులు, పవన్‌కుమార్ కలిసి ఈనెల 17న రాత్రి బొలేరో వాహనం తీసుకొచ్చి 24 బ్యాటరీలను అపహరించుకొని వెళ్లారని తెలిపారు. శుక్రవారం ఉదయం బొమ్మనహాళ్ ఎస్‌ఐ శివ మండలంలోని గోవిందవాడ క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండా రూ. 3.75 లక్షల విలువ గల 24 బ్యాటరీలు బొలెరో వాహనంలో తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. బొలెరో వాహనంతో పాటు కిరణ్‌బాబుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

భర్త వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: భర్త వేధింపులు తాళలేక ఓ ఇల్లాలు ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక త్రీటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఎర్రనేల కొట్టాలకు చెందిన దూదేకుల అమీదా (32)ని 13 ఏళ్ల క్రితం ఎర్రనేల కొట్టాలకు చెందిన మహ్మద్ రఫీకి ఇచ్చి పెద్దలు వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సాఫీగా సాగిపోతున్న వారి జీవితంలో మద్యం చిచ్చుపెట్టింది. పనిపాటలేకుండా జులాయిగా తిరిగే భర్త నిత్యం తాగుడుకు డబ్బు కావాలని భార్యను వేధించేవాడు. ఎర్రనేల కొట్టాలలో అమీద వలంటర్‌గా పని చేస్తున్నారు. వచ్చే డబ్బుతో కుటుంబాన్ని అతికష్టం మీద నడిపేది. బాధ్యతలను పంచుకోవాల్సిన భర్త డబ్బు కోసం నిత్యం వేధింపులకు దిగటాన్ని జీర్ణించుకోలేని అమీదా పెద్దమనుషుల సమక్షంలో రెండు రోజుల క్రితం పంచాయతీ పెట్టింది. పెద్దలు చెప్పిన మాటలను సైతం భర్త లెక్కచేయలేదు. దీంతో మనస్థాపం చెందిన భార్య శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను ఉరితాడు నుంచి విడిపించి ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా అప్పటికే అమీదా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

లారీడ్రైవర్‌పై కత్తితో దాడి.. నగదు అపహరణ

తాడిపత్రి: మండల పరిధిలోని అర్జాస్ స్టీల్‌ప్లాంట్ సమీపంలో తాడిపత్రి – కడప రహదారిపై లారీడ్రైవర్‌ను కత్తితో పొడిచి అతడి వద్ద ఉన్న నగదును దోచుకెళ్లిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. కడప జిల్లాకు చెందిన లారీడ్రైవర్ శివకృష్ణ ఆచారి మండలంలోని పెన్నా సిమెంట్ పరిశ్రమ నుంచి శుక్రవారం రాత్రి సిమెంట్ బస్తాల లోడ్‌తో కడపకు బయలుదేరాడు. అర్జాస్ స్టీల్ ప్లాంట్ సమీపంలోకి రాగానే బహిర్భూమికి వెళ్లేందుకు లారీని రహదారి పక్కన ఆ ఆపి కిందకు దిగాడు. అంతలోనే మోటార్ సైకిళ్లపై వచ్చిన నలుగురు దొంగలు కత్తిని చూపుతూ తన వద్ద ఉన్న నగదును ఇవ్వాలని బెదిరించారు. ప్రతిఘటనకు దిగిన శివకృష్ణ ఆచారి చేతిపై కత్తితో దాడి చేశారు. దీంతో అతడి వద్ద ఉన్న నగదు రూ. 6 వేలతో పాటు, మొబైల్ ఫోన్, లారీలోని వంట సామగ్రిని ఎత్తుకుని పారిపోయారు. శివకృష్ణను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.